స్వర్గ సోపానం మొదటి మెట్టు

కోమలాదేవి

కృష్ణపక్ష మసక వెన్నెల.

పలుచని మంచు తెరలోంచి-ప్రముఖ రేఖా చిత్రకారుడు తన కుంచెతో అలా ....అలా గీచిన ఔట్‌లైన్‌లా దూరపు గోథిక్ చర్చి గోపురం కనబడుతోంది.

గోడవారగా - చీకటిని కౌగలించుకుంటూ నిర్మానుష్యమైన రహదారివెంట భయం భయంగా అటు ఇటు చూస్తూ తన్ను తాను రక్షించుకోవాలన్న బలవత్తరమైన సహజకోర్కె అణువణువున వ్యాపించగా ఆమె ఎలాగో ఆ చర్చి గేటు త్రోసింది-కాని లోపల ఒక కిలో బరువుగల తాళంకప్ప ఆమె చేతులకు చల్లగా భయంకరంగా తగిలింది!

దేవుడి గుడికి తాళంకప్పా! ఇక్కడ కూడ ఆమెకు మూసిన తలుపులేనా? రక్షణ కోసం పరుగెత్తుకువస్తే ఈ తాళంకప్ప ఆమెను అడ్డగిస్తోంది!

ఆమె ఆత్రంగా రెట్టించిన భయంతో అటు ఇటు చూచింది. ఎవ్వరూ లేరు. పిట్ట అరుపుకే ఆమె గుండెలు దడదడలాడాయి. ఎవరైనా రావచ్చు బాబోయ్! ఆమె వెంటనే చీర కచ్చాపోసి దోపింది. అడ్డ కంబీమీద కాలేసి ఎక్కింది. బల్లేల్లా మొనదేలిన గేట్ పైభాగం ఆమె కంఠం వరకు వచ్చింది. ఎట్లా? ఆ పై కంబీ మీద కాలుపెట్టి ఆ మొనదేలిన 'బల్లేలను' దాటి అవతలికి దూకగలదా!

ఆమెలోని నిరాశను, భయాన్ని వెలికి దీసి ఆమెలో ఏమాత్రం జీవితం మీద ఆశఉన్నా దాన్ని మొదలంటా నరికివేస్తూ ఆమెమీద వెలుగు పడింది. "ఎవరు నీవు?"

ఆమె ఉలికిపోయింది. తరువాత కుప్పగా దబ్బున పడిపోయింది. తను దొరికిపోయిందన్న భయం ఆమెను నిస్సత్తువగా జేసి ఏదో సూన్యంలోకి లాక్కు-

పోతున్నలా ఉంది. ఆ సమయంలో ఆమెకు ఓ సత్యం కాంతికిరణంలా కనబడింది. లోపలినుండి తాళం వేస్తున్నారు! అంటే! బైట తనను పట్టుకోటానికి ఎవ్వరూ రాలేరన్నమాట. ఆమె తేలికపడ్డ హృదయంతో కళ్ళు మూసుకుంది. తాళం తీస్తున్న చప్పుడుకి గొళ్ళెం తీస్తున్న చప్పుడు ఆమెకు మధురాతి మధురంగ వినబడింది.

"ఎవరమ్మా-ఏం కావాలి?"

"అభాగ్యురాల్ని. రక్షించండి" అంది అతి దీనంగా.

"రా....లోపలికి" కొద్దిగా తెరచిన గేట్‌కు అడ్డం తొలిగాడు. ఆమె సంకోచించక పరుగుపెట్టినట్లే లోపలికెళ్ళింది ఆతను మాట్లాడలేదు. టార్చివేస్తూ నడుస్తున్నాడు. అతడి అడుగుజాడల్లో నిశ్చింతగ నడుస్తోందామె. దార్లుతీరిన వృక్షాలమధ్య కాలిబాటన వెళ్ళి చిన్న ఇంటిని సమీపించారు. చిన్న చెక్కగేట్ తీసి లోపలికెళ్ళాడు. ఆమె అనుసరించింది.

ముందరి గదిలోకి అడుగుపెట్టగానే-ఆమెను ఎవరో వెనక్కు లాగినట్లు చటుక్కున వెనుదిరిగి కచ్చాపోసిన చీర సరిచేసుకు వచ్చింది.

"నేను ఈ చర్చికి ఫాదరీని. అంటే ప్రీస్టను. ఆ గదిలో అన్నీ ఉంటాయి. వెళ్లు" అన్నాడతను.

ఆమె దండంపెట్టి ప్రక్కగా ఉన్న గదిలోకి వెళ్ళింది. అతను లైట్ ఆర్పి లోపలికెళ్ళిపోయాడు.

లైట్ వేసి ఆ గదిలో తను సురక్షితంగా ఉండగలదన్న సత్యం తెలుసుకున్న వెంటనే లైట్ తీసేసింది. భయం-అనుమానం - అపనమ్మకం ఆమెలో జీర్ణించుకుపోయి ఉండగా చటుక్కున తలుపువేసుకుని గడియ బిగించింది. ఆ తలుపు ఎవ్వరూ తెరవకూడదు తెరిచినా లోపలికి రాకూడదన్నట్లు తలుపుకు అనుకుని కూర్చుండిపోయింది. తను సురక్షితంగా ఉంది-ఆ భావనకు ఆమె ఇంద్రియాలు సడలినై. స్థబ్దుగా కూర్చుని కాసేపటికి నేలమీద ఒరిగిపోయింది. మరుక్షణంలో గాఢ నిదురలోకి జారిపోయింది.

ఉదయం ఎనిమిది గంటలైనా ఆమె లేవలేదు. ఆయన అంగారుగా తలుపు దగ్గర నుంచున్నాడు. సందడి లేదు. అవతలగా వెళ్ళి కిటికీలోంచి చూచాడు. ఆమె తలుపుకు అనుకొని నిదురబోతోంది!

పాపం- అనుకున్నాడు.

పనిమనిషివచ్చి తన పనులు ముగించుకొని వెళ్ళిపోయింది. అతడు ట్రేలో కాఫీ ఉప్మా పెట్టుకొని గదిలోకి తీసుకొని వెళ్ళాడు.

"రాత్రి ఎవరో వచ్చినట్లున్నారు?" కాంత అడిగింది.

"ఔను. మరో అభాగిని ....ఇంకా నిద్రపోతూనే ఉంది. బహుశః భద్రత అనుకుంటా. హాయిగా పడుకుంది"

"ఔను." ఆమెను మెల్లగా లేపి కూర్చోబెట్టాడు. కప్పు చేతికి అందించాడు.

అతడు మాట్లాడలేదు. తను గూడా త్రాగుతూ-ఉప్మా తింటున్నాడు.

"ఎవరు? ఏం జరిగిందట?"

"తెలీదు. కాని ఆమె ప్రవర్తన వింతగా ఉంది... గేట్ చప్పుడుచేసి పిలుస్తారు. కాని రాత్రి ఆమె గేట్ ఎక్కి దూకాలని ప్రయత్నించింది."

"బహుశః ఎవరైనా వెంటాడుతున్నారేమో?"

"కావచ్చు. నే నేమీ అడగలేదు? రెండురోజులుండి వెళ్ళిపోతుంది. ఎల్లప్పుడు మన దగ్గర ఉండదు కదా?"

ఆయన ఆమె కాళీచేసినవి తీసుకొని లోపలికెళ్ళిపోయాడు. ఆమె తనప్రక్కన ఉన్న దువ్వెన తీసుకొని మెల్లగా తల దువ్వుకుంది. ఆయనవచ్చి రెండు జెడలు అల్లాడు.

"నాకెందుకింతపొడవైన వెంట్రుకలు-కత్తిరించండి. మీకు కూడ సులభమౌతుంది" అంది భర్తవేపు వేడికోలుగా చూస్తూ.

ఆయన నవ్వాడు "ఒద్దు....నాకిష్టమైన పనుల్లో-ఇలా జడలువేయటం ఒకటి.... తెలుసా."

ఆమె మరి మాట్లాడలేదు. కళ్ళను కప్పుతోన్న నీటిపొర తడి కంట ద కుండా కన్ను మూసేసుకుంది. కాని అతడు గ్రహించాడు. ముందుకు వంగి - ఆమె చెక్కిలికి తన చెక్కిలి ఆనించి ఆర్ద్రంగా అన్నాడు.

"నువ్వు ఇలా బాధపడటం మానక పోతే నేను ఇంకా బాధపడ్తాను. అది నీ కానందమా?"

"ఊహూం" అంటూనే అతడి మెడ చుట్టూ చేతులువేసి కాసేపు అతణ్ణి తనకు దగ్గరగా పట్టుకుంది. ఆ సన్నిహితత్వం చాలు-ఆమెకు మనోబలం ప్రసాదించటానికి. తలుపుతీసిన చప్పుడైంది. ఆమె అతణ్ణి వొదిలి తలగడలమీద ఆనుకుంది. అప్పుడు వచ్చిందామె.

శాంత-దగ్గరకు రమ్మన్నట్లు తలూపింది. ఆమె వచ్చి నమస్కరించింది.

"నీ పేరేమిటమ్మా?" అడుగుతూ స్టూలు చూపించింది.

"నా పేరు .... సునీత.... అంటారు" అని ఆమె శాంతను ఆమె భర్తను-శాంత పడుకున్నరీతిని-అతడు జడ అల్లుతున్న చర్యను నిశ్చేష్టితయై చూస్తోంది.

"అమ్మా .... మీకు .... ఆరోగ్యం సరిగా లేదా?"

శాంత నవ్వింది. "నా ఆరోగ్యం సరిగానే ఉంది. రెండేళ్ళుగా ఇలా పడకలో ఉన్నాను."

"మీరు నడవలేరా?" అంది ఆశ్చర్యంతో.

"లేదు" శాంతముక్తసరిగా అంది. ఆయన జడలువేసి అక్కడినుండి వెళ్ళిపోయాడు.



"ఏమైనా వండుకుని తిన్నావా?" శాంత అడిగింది.

"లేదు ఆలస్యంగా లేచాను. మన్నించండి."

"ఫరవాలేదు వెళ్ళు నీ పనులు ముగించుకుని-ఏదైనా తినిరా"

సునీత వెళ్ళింది. గదిలో స్టౌ మొదలు వంటసామానంతా ఉంది. ఆమె అలా చూస్తోనేఉంది- అతడు వచ్చి సగంగ్లాసు పాలు ఇస్తూ అన్నాడు "అన్నీ ఉంటాయి. ఏదో ఒకటి లేకపోయినా ఫరవాలేదు. వండి తినమ్మా."

ఆమె గ్లాసు తీసుకుంది. అతడు వెళ్ళిపోయాడు. ఆమె తన పనులు ముగించి వంట ప్రారంభించింది. ఆమె మనసులో శాంత- అతను మెదులుతున్నారు. చూస్తే వయసు చిన్నదే! అప్పుడే ఆమెకు ఏదో జబ్బు! ఎంత అనురాగంతో ఆమెకు సేవచేస్తున్నాడు! అతడికి కూడా ముప్ఫైదాటి ఉండవు. ఇది సాధ్యమా.... ఈ అనుబంధం ఆమెకు విచిత్రంగా తోచింది.

రెండు రోజులు గడిచిపోయాయి. ఆమెను గురించిన వివరాలు శాంతగాని- అతడుగాని అడగలేదు. ఆమెకు ఎంతో ఆశ్చర్యంగా ఉంది. అతడు ఉళ్ళోకి వెళ్ళినప్పుడు చర్చిపనులలో లీనమై వున్నప్పుడు సునీత శాంతదగ్గర కెళ్ళి కూర్చునేది.

మూడవరోజు ఉదయం అతడు పాలు అందిస్తూ అన్నాడు.

"అమ్మా ఈ రెండురోజుల్లో ఎక్కడికి వెళ్ళాలో నిర్ణయించుకుని ఉంటావు. రెండు మూడు రోజుల్లో మీరు వెళ్ళిపోవాలి."

ఆమె పాలగ్లాసు అందుకోలేదు. నిస్సహాయంతో గోడకు ఆనుకున్నది. ఈ భద్రతను ఇంత త్వరగా కోల్పోతుందని ఆమె అనుకోలేదు.

"అయ్యో నాకు ఎవ్వరూ లేరు...." గాభరాగా అంది

"ఎవ్వరు లేకుండా ఇంతవారు కాలేరు." అతడు శాంతంగా అన్నాడు.

"నాకు ఒకరున్నారు. వారివల్ల ఇంత దాన్ని అయ్యాను - అని చెప్పుకోగల వారెవ్వరూ లేరు. కన్నీటితో చాలీచాలని తిండితో— క్రూరత్వమే నన్ను పెంచింది. ఎక్కడికి వెళ్ళినా ఆశ్రయం దొరకదని— స్వర్గానికి సోపానం అన్నట్లున్న ఈ గుడిగోపురాన్ని చూచి గంపెడాశతో వచ్చాను."

"కావచ్చు - కాని ఆ సోపానపు మొదటిమెట్టు ఈ భూమిమీదనే ఉన్నది. కనుక మనం ఈ మెట్టుదగ్గర ప్రారంభించాలి. ఆపదలో ఉన్నవారికి ఆశ్రయం ఇస్తాను. కాని కొంత కాలం వరకే. ఇలా వచ్చినవారి నందరినీ జీవితాంతం భరించే స్తోమత నాకు లేదమ్మా. మీకు ఎవ్వరూ లేకపోతే ఏదైనా శరణాలయానికో ఆశ్రమానికో పంపే ఏర్పాటు చేస్తాను."

ఆమె చేతులుకట్టుకుంది. చేతుల వ్రేళ్ళు రెక్కల్లో దిగబడిపోతున్నంతగా బిగిసిపోతున్నాయి. ఆమె ముఖంలోని పాండురతకు అతడు అచ్చెరువొందాడు.

'జీవితంలో పోరాడి విసిగిపోయినట్లుంది పాపం' అనుకున్నాడు.

"భయంలేదు. ఏదో ఉద్యోగం...."

"అయ్యో.... ఇక్కడే ఏదైనా పని ఇవ్వండి....నాకు జీతం వద్దు. ఇంత తిండి ఉంటే చాలు. మీరు లేనప్పుడు అమ్మగార్ని చూచుకుంటాను."

"ఆలోచిస్తాను....ఇది తీసుకో" అని పాలగ్లాసు పెట్టి వెళ్ళిపోయాడు. ఆమె అన్నమాట శాంతకు చెప్పాడు. శాంత ఎక్కువసేపు ఆలోచించలేదు.

"చూడండి—మనం ఆయాను పెట్టుకోలేము. జీవితంలో దెబ్బతిన్న వ్యక్తి.... ఇంత తిని పడిఉంటుంది. నా భారం మీకు కొంత తగ్గుతుంది. ఇంట్లో మరొక మనిషి ఉంటే నాకు కూడా బావుంటుంది"

అతడు జాలితో ఆమెచెంత కూర్చున్నాడు ఆమె చేతిని తన చేతిలో పట్టుకుని మృదువుగా హెచ్చరించాడు.

"శాంతా... ఆమె చిన్నది....నిండు యౌవనంలో ఉంది."

"మీమీద నాకు విశ్వాసం ఉంది" అంది దృఢంగా.

"అదికాదు ఆమెను గురించి మనకు ఏమీ తెలీదు. తొందరపడి అంగీకరించ కూడదు."

"ఆమె షాక్‌లో ఉంది. మెల్లగా అడిగి కనుక్కుంటాను. అప్పుడు ఆమె ఉండటం వల్ల నియమోల్లంఘన అవుతుందనుకుంటే పంపించివేద్దాం. ఇంతవరకు ఎవ్వరు కూడ ఉంటామన లేదు. వారి దారి వారు చూసుకున్నారు. పోనీ ఆమెకు అవకాశం ఇస్తే!"

అతడు ఆమె వెక్కిళ్ళను మృదువుగ నిమిరాడు.

"ఆమెచేత పనులు చేయించుకోవటం అలవాటవుతుంది. ఆ సుఖం మరిగిన తరువాత ఆమెను ఒదులుకోగలమా? ఒద్దు...."

శాంత భర్త కళ్ళలోకి చూచింది. తన ఇష్టానికి స్వస్తిచెప్పి రెండేళ్ళయింది. ఈనాడు కూడా లొంగిపోయింది. "మీ ఇష్టం" అంది నిండుమనసుతో.

"అట్లా ఉండాలి" అని అతడు వెళ్ళిపోయాడు.

అతణ్ణి అలా చూస్తూనే ఉంది. ఒక్కొ రోజు గడిచేకొలది భర్తలో ఒక్కొ సుగుణం బహిర్గతమౌతుంటే ఆమె హృదయం ఆరాధనతో పరవశించి పోయేది. తనకే కాళ్ళుండి ఉంటే తను అతడి కోసం ఎంతెంత సేవజేసేదో!

అంతరాత్మ నవ్వింది!

ఆమె సిగ్గుపడింది! నిజమే పెద్ద ఉద్యోగస్తుణ్ణి, నెల తిరిగేసరికి కనీసం రెండువేలు జీతం తెచ్చేవ్యక్తిని పెళ్ళాడాలని ఆమె ఎంతగానో ఆశించింది. కాని అది సాధ్యం కాలేదు. తన తల్లిదండ్రులకు ఇతడు చాలా నచ్చాడు. డబ్బు కాదు ప్రధానం—గుణం ప్రధానమన్నారు. అయినా ఒక బ్రాంచి పోస్టాఫీసు పోస్ట్ మాస్టర్ అంతకన్నా గొప్పసంబంధం కూతురికి తేలేదు. శాంత అత్యంత రూపసి కాదు, చూడటానికి బాగానే ఉంటుంది.

పెళ్ళైన క్రొత్తల్లో ఆమె రిజర్వ్‌గా ఉండేది, ఆమె స్వభావమే అంతకాబో లును అని అతడు మెల్లమెల్లగా ఆమె ప్రవర్తనను మార్చగల్గాడు.

ఇప్పుడు ఆమె అతణ్ణి ఎంతగా ప్రేమించి ఆరాధిస్తోందంటే - తను ఈ లోకంలోంచి తొలగిపోతే అతడు మళ్ళీ వివాహంచేసుకుని ఆమెతోనైనా అతడు సుఖించాలని కాంక్షిస్తోంది.

కాని అతడి పరిచర్యలో ఆమె నూతన శక్తిని పుంజుకుంటుంది. అతణ్ణి ఆమె విడిచిపోలేదు. అతణ్ణి ఒంటరివాడినిచేసి వెళ్ళలేదు. నడుంపైనుండి తన ఆరోగ్యానికే ప్రతిరూపం అన్నట్లుగాఉంది. తనకు చావు ఇప్పట్లో రాదు. తీసుకుని పోవాలనుకున్నా దానికి తగిన వాతావరణం ఆ గృహంలో లేదు.

అతడు వెళ్ళిపోయాడు. శాంత ఎప్పటి మాదిరిగానే ట్రాన్సిస్టర్ పెట్టుకుంది.

కిటికీలోంచి జామచెట్టు కనిపిస్తోంది. పచ్చి జామకాయలు తన కెంతో ఇష్టం. తన భర్తకు చెప్పాలి....

"అమ్మా" సునీత లోపలికొచ్చింది.

ఒకటే చీర ఆరీఆరకుండా ఉంది. ఆ చీర ఒంటిని అంటి పెట్టుకుని ఆమెలోని యౌవనాన్ని మరీ బహిర్గతం చేస్తోంది.

"నీకు చీరలు లేవు కదూ?"

"అవునమ్మా" అంటూ దగ్గరకు వచ్చి క్రింద కూర్చుంది.

"ఆ పెట్టె తెరువు. పసుపుగళ్ళచీర ఉంది. తీసుకొని కట్టుకో" అంది శాంత.

"అయ్యగారు ఇంట్లో లేరని కట్టుకున్నాను ఆరిపోతుందిలెండి."

"ఫరవాలేదు. వెళ్ళి కట్టుకో"

సునీతకు తప్పలేదు. చీరతీసి కట్టుకుంది. తడిచీర అరవేసి వచ్చింది.

"అమ్మా - మీకు ఏమైంది?"

"ఏదో అయింది. దాన్ని జ్ఞాపకంచేసుకోవటానికి ఇష్టంలేదు."

"మిమ్మల్ని చూస్తే జాలేస్తోంది."

"జాను, ఒకరి జాలి దయలమీద ఆధారపడి ఉండాలి. ప్రథమంలో....అన్నట్టు సునీతా నువ్వు వెళ్ళిపో. నాతో మాట్లాడవద్దు.... ఇలా ఒంటరిగా ఉండటం అలవాటు, వెళ్ళిపో."

"అయ్యగారు ఏమన్నారమ్మా, నేను మీకు సేవచేస్తూ...."

"సునీతా....ఒద్దన్నారు. మేము పేదవాళ్ళం. మరో వ్యక్తిని పోషించే శక్తి లేదు ఒద్దన్నారు....వెళ్ళిపో."

సునీత ముఖంలో దైన్యం చూచి శాంత కళ్ళు త్రిప్పేసింది.

"మీతో మాట్లాడటానికి కూడ తగనా అమ్మా?"

"అదికాదు. ఒక జీవితవిధానానికి అలవాటు పడ్డాను...." అంతకన్నా ఎక్కువ మాట్లాడితే తాను నిజం చెప్పేస్తుందన్న వంకతో మౌనం దాల్చింది.

సునీత ఆలోచిస్తోంది. ఈమె మనసు కరిగించాలి. తన కథ వినాలి. ఏ ఆడది తన కథ విని ఊరకుండగలదు.

"అమ్మా! మీతో సమానంగా నాకు అన్ని సుఖాలు అక్కర్లేదు. ఓ గోనె ముక్కమీద పడుకుంటాను. ఈ శరీరం నిలబడిఉండి శ్రమించటానికి కావలసిన తిండి ఉంటే చాలు. మీ పాతచీర చాలు. మీకు.... మరేవిధమైన అనుమానం ఉంటే...." ఆమె తలవంచి కంఠం తగ్గించింది.

"నేను అయ్యగారి ఎదుటికి రాను."

ఆ మాటలకు శాంతకు కోపంవచ్చింది. దురుసుగ జవాబు ఇవ్వాల్సిన కాంక్షను అణచుకుంది. శాంతచిత్తయై మెల్లగా అంది....

"సునీతా! నాకే భయం లేదు. వారికి కూడ లేదు." సునీత లోలోన ఆనందించింది - వాదించటానికి చక్కని అంశం - అని



"అమ్మా - ఏదీ చెప్పలేము. మీరీ విధంగా ఉండటంవల్ల అది సాధ్యమన్న భయం మీలోఉందేమోనని ఎదుటబడనని చెబుతున్నాను" తీపిగా అంది.

"లేదు, ఆ భయంలేదు. అయన మత గురువు, బోధకుడు - దైవజ్ఞుడు - దేవుని సేవకుడు...."

"నిజమే....అన్నింటి కన్న ముందర వారుకూడ ఒక మనిషి.... మానవుడు.... ఇందాకనే అన్నారు ... స్వర్గానికి సోపానాలున్నా మెదటిమెట్టు ఈపృధ్విపై ఉందని." శాంత ఆలోచిస్తోంది. ఈమె తనను భయపెడ్తున్నదా! అయన కూడ అతి మామూలుమనిషి అని చెబుతున్నదా! ఒకవేళ అవే యదార్థమైతే....

"సునీతా.... నీవన్నది నేను అంగీకరించను. కాని ఒక వేళ నీ వాదన సరియైనదన్న విశ్వాసం నీకుంటే ఈ క్షణంలో నీవు ఈ గృహం వీడిపోవటం సమంజసం కాదు! ఒక నిండు కుండలో విష బిందువు చిలకరించటం నీకు న్యాయమేనా? నన్ను చూడు....ఒక స్త్రీగా....నీవు చేయదగినది...."

సునీత హృదయం బాధతో నలిగిపోయింది, గభాల్న ఆమె చేయి పట్టుకుంది....

"అమ్మా.... పాపకూపంనుండి రక్షిం చుకుని వచ్చాను. నా ఆలోచన ఆ కోణంలోఉండటం సమంజసమే. నన్ను క్షమించండి."

శాంత మెల్లగా తన చేయి విడిపించు కున్నది.

"నీ పేరేమిటి? నీవు ఎవరవు?" ఆమె కళ్ళలోకి తీక్షణంగా చూస్తూ ప్రశ్నించింది.

"చెబుతాను....నా కథ చెబుతాను.... నా పేరు సుమతి. కాని చాలా రోజులుగా నన్ను సునీత అని పిల్చేవారు. భయపడ కండి....నేను ఆశ్రమంలో పెరిగాను.... మా అమ్మ నాన్న కుష్ఠువారు. పిల్లలు పుట్టగానే వారిని తల్లిదండ్రుల దగ్గర నుండి దూరంచేస్తారు....మీకు తెలుసును కదా?" శాంత ఔనన్నట్లు తలూపింది. కుష్ఠు అన్న శబ్దం వినగానే ఆమె భయ పడిన మాట వాస్తవమే." తల్లిదండ్రు లతో మాట్లాడి దూరదూరంగానే ఉంటూ పెరిగాము. ప్రథమం నుండి నేను చదువు మీద శ్రద్ధ కనపర్చటంతో నన్ను చదివిస్తూ పోయారు. నేను కాకినాడలో బి.ఏ. చదవి పాసయ్యాను."

"అందుకే నీవు చాలా దూరం ఆలో చించి మాట్లాడావు...." అంది శాంత శాంతనవ్వుతూ.

"ఔనమ్మా. ఆ తరువాత టీచర్ ట్రైనింగ్ అయి ఉద్యోగం చెయ్యాలను కున్నాను. ఇంతలో నన్ను - అంటే ఆశ్రమంలో పెరిగిన మాలాంటివారిని పెళ్ళాడటానికి కొందరు ముందు కొచ్చారు. వాళ్ళు కూడ మాలాటివారే. అతడు విజయవాడలో ఒక నర్సింగ్ హోమ్‌లో క్లర్క్, రైటర్, మెకానిక్ అన్నీను. వెంటనే పెళ్ళిచేసి పంపారు. కానీ అతడు నన్ను హనీమూన్ అంటూ హైదరాబాద్ తీసుకుని వెళ్ళాడు.... ఆ తరువాత అతణ్ణి చూడలేదు ....

"అంటే........"

శాంత కళ్ళు ఆశ్చర్యంతో చక్రాల్లా అయ్యాయి.

"ఆ.... " అంది బాధగా....

"స్టేషన్‌లో దిగగానే ఆటో తెస్తానని వెళ్ళాడు. మరి రాలేదు. ఎవరో అతను వచ్చి దూరంగాఉన్న నా భర్తను చూపి "నిన్ను రమ్మంటున్నాడు" అని సామాను ఎత్తుకున్నాడు. అతడు 'రా' అన్నట్లు చేయి ఊపాడు. ఆటోలో సామాను పెట్టి అతడు వెళ్ళిపోయాడు. ఆయన వచ్చి పక్కన కూర్చున్నాడు. ఎందువల్లనో అతడు చాల చికాకుగా, ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు. ఒక చిన్న హోటల్ చేరాము. సామాను గదిలో పెట్టి కాఫీ తెస్తాను అని వెళ్ళిపోయాడు.... అంతలో అటుగా ఒక ముసలివాడు చీపురు తీసుకొని వచ్చాడు........ వాడిని చూడగా నేనూ ఆశ్రమంలోని ముసలి వాడు జ్ఞాపకం వచ్చాడు తాతా అని పలుకరించాను. అతడు చెప్పిన విషయం

విని నిర్ఘాంతపోయాను. చేతలు దక్కి-నుంచున్న నన్ను వెనకవైపు నుండి వీధిలోకి త్రోసి ఇరవై రూపాయాలు ఇచ్చాడు.... అతడు నన్ను అమ్మేస్తాడట! అదీ సంగతి." అంది.

శాంత "అమ్మో - ఎంత ఘోరం! ఆ తర్వాత ఏమైంది?"

"ఆ ముసలతని కూతుర్ని చిన్నప్పుడు ఇలాగే ఎవరో చేస్తే అతడు జాలిపడి పిలున్నప్పుడు హెచ్చరిస్తాడట. నేను బైటికి వచ్చి రిక్షాఎక్కి- కొస్త దూరం వెళ్ళానో లేదో ఎవరో సైకిల్ మీద నన్ను వెంబడిస్తున్నారా అనిపించింది, ఒక అస్పత్రి కనిపిస్తే అక్కడ దిగిపోయి రోగుల క్యూలో నుంచున్నాను. సాయంత్రం దాకా ఉన్నాను. స్టేషన్ చేరుకుంటే ఇంటికి వెళ్ళొచ్చనుకున్నాను, కాని ఎవరో ఇద్దరు ఆడవారు నన్ను వెంబడించారు. నేను సాయంత్రం రిక్షా ఎక్కి-స్టేషన్‌కు పోనిమ్మన్నాను. కాని ఇంతలో ఎవరో నా ప్రక్కన ఎక్కబోయారు. చూద్దును కదా! నా భర్త. కెవ్వున అరచి పడిపోయాను. ఆ తరువాత చూస్తే ఒక కారులో సీట్‌మీద ఉన్నాను. తలుపు తీసి పారిపోయాను. ఇక్కడి కొచ్చాను. నాకు సంగీతం విన్పించింది. అంటే అది ఒక విధమైన నైట్‌క్లబ్ అనుకుంటా. వాళ్ళు లోపలికి ఎందు కెళ్ళారో మీరు ఊహించగలరు. ఇప్పుడు చెప్పండి. నేను చివరికి కాకినాడ కూడ వెళ్ళలేను. నా భర్త అనబడే వ్యక్తి వస్తాడు. భర్త ఎలాంటివాడైనా వెంట వెళ్ళమని తరిమేస్తారు. ఈసారి నేను పారిపోలేనటువంటి చోటు చూచి జాగ్రత్తపడ్తారు.

"నిన్ను కట్టిపడెయ్యలేదా?"

"లేదు. ఏదో మత్తుమందు ఇచ్చి ఉంటారు. కష్టేస్తే అనుమానపడ్తారు. సీటుమీద పడుకుని ఉంటే ఏదో సొంత మనిషి అనుకుంటారు. ఇట్లా తప్పించుకుని బైటపడ్తానని అనుకోలేదమ్మా...." సునీత కంఠం జీరబోయింది. అశ్రుధారల్ని తుడుచుకుంటూ కూర్చుంది.

శాంత హృదయం జాలితో నిండిపోయింది.... పాపం అభాగ్యురాలు.... కాని తను తన భర్తను ఒప్పించలేదు. ఆయనకు ఇష్టంలేదా....

"సునీతా.... నువ్వు చాలా క్లిష్టమైన పరిస్థితిలో ఉన్నావు. అయ్యగారు నిన్ను భద్రంగా ఒక శరణాలయంలో చేర్పిస్తారు. భయంలేదు."

"అమ్మా-మళ్ళీ అదేమాట. ఈ శరణాలయాల్లో ఉందేదంతా అవినీతి-పిల్లల కడుపులుకొట్టి బ్రతుకుతారు అధికారులు. యౌవనంలో ఉన్న ఆడపిల్లల బ్రతుకుల్ని నాశనం చేస్తారు. నాలాటి వారిని సానుభూతితో చూడరు. నేను పెరిగింది అటువంటి చోట్లలోనే. నాకు అన్నీ తెలుసును. అయ్యగార్కి- వాటి లోపలి రంగు తెలీదు."

శాంత నవ్వింది "నీకు–ఇవన్నీ–భయంకరంగా ఉన్నాయి–అన్న నమ్మకం గట్టిగా నాటుకుపోయింది. నీలో తప్పు లేదు. కాని నన్ను అలాంటి చోటికి పంపరు. కొన్ని మంచివికూడ ఉన్నాయి. అక్కడికే పంపే ఏర్పాటు చేస్తారు."

సునీత పుట్టెడు దిగులుతో తలవంచుకుంది.

"సాటి స్త్రీని–మీకే నాపై జాలిలేదు" అంది విరక్తిగా.

"జాలిపడి నేనేం చెయ్యగలను. నేనే భారంగా ఉన్నాను మాకు వచ్చే డబ్బు మాకు కటాకటీగా సరిపోతుంది."

ఇది సమయం కాదు. మెల్ల మెల్లగా బోధపర్చాలనుకుంది సునీత.

"అయ్యగారు ఏంపని చేస్తారమ్మా! ఆదివారాలు గురువుగా ఆరాధన నడిపించటమేనా?"

శాంత నవ్వి "ఇంకా ఎన్నో బాధ్యతలున్నాయి. ఒకటి ఆస్పత్రులకు వెళ్తారు."

"ఎందుకు?"

"సుస్తీగా ఉన్నవారిని చూచి ప్రార్థన చేస్తారు. ధైర్యం చెబుతారు. ఎవరైనా చనిపోతే వారి తాలూకు వ్యక్తులను ఓదార్చి సహాయంచేస్తారు. సీఎయస్‌గా ఉన్నవారి చెంత కూర్చుని వారి బంధువులకుతోడుగాఉండి ప్రార్థన చేస్తారు. వాళ్ళ మనోబలంకోసం ప్రార్థన చేస్తారు. ....ఇంకాజైలుకు వెళ్తారు."

"జైలుకా? ఏందుకు?" గాభరాగా అడిగింది.

శాంత నవ్వింది. "నేరస్థులకు పాపభీతి కల్గించటానికి మళ్ళీ ఆనేరం చేయకుండా ఉండటానికి కావలసిన మార్పు ఆ మనుషుల్లో తేవటానికి. జీవితం మీద నిరాశలో ఉన్నవారికి ఆశకల్పించటానికి. శిక్షాకాలం పూర్తయ్యాక వారు తిరిగి ఆ నేరం చేయకుండా సహాయపడటానికి–వీలైతే చిన్నచిన్న ఉద్యోగాల్లో ప్రవేశపెట్టటానికి – జైల్లో వారి ప్రవర్తనలో మార్పు తీసుకునిరావటానికి–మన జైళ్ళు ఎంత అధోగతిలో ఉన్నాయో మనం చదువుతూనే ఉన్నాము."

"ఆ నేరస్థులు ఎగతాళి చేసి నవ్వరూ. పో–పోవయ్యా మహాచెప్పావు–అనరూ?"

"అంటారు. ఎందుకనరు? అసలు మాట్లాడనివ్వరట. ఈలలు, పిల్లికూతలు వేస్తూ నానాఅల్లరిచేసి అసహ్యకరమైన ప్రశ్నలువేసి ఏంజవాబు చెబుతాడో చూద్దాం–అన్నట్లుంటారట. చాలా కష్టం. కాని అది వారికి మామూలే. ఇదొక బాధ్యత – అందుకని విధిగా వెళ్తారు. ప్రార్థనచేస్తారు మంచిమాటలు చెబుతారు. కాలంగడిచేకొలది కొందరు నిజంగానే మారిపోతారు – మంచిప్రవర్తనతో శిక్షాకాలం ముగియకముందే విడుదలపొందిన వారు కూడా ఉన్నారు."

"నిజమేనా అమ్మా!" ఆశ్చర్యంతో అడిగింది

"నిజమే. మరణశిక్షలు ఉన్నవారిని కూడా కలుసుకుంటారు"

"ఎందుకు?" సునీత ఆత్రంగా అడిగింది.

"ఎందుకమ్మా చేసిన నేరానికి చచ్చి నరకానికి పోయేవాళ్ళు మనసేం మార్చుకుంటారు? మార్చుకున్నా విడుదలై సత్ప్రివర్తనులుగా చలామణి అవలేరు కదమ్మా!"

"పిచ్చిదానా-స్వేచ్ఛ అంటే దానిఅర్థం అలా బైట తిరిగిరావటం కాదు. ఉదాహరణకి నీకు స్వేచ్ఛ ఉందా? నీలోని భయానికి బానిసవయ్యావు. ఆ భయం నిన్ను బలమైన సంకెళ్ళతో బంధించి వేసింది. నీవు జైల్లో ఉన్నదానితో సమానం-కాదా...."

సునీత శరీరం భయంతో కంపించింది.

"నేను చూడు. ఈ మంచానికి, ఈ గదికి పరిమితమైంది నా జీవితం. కాని నా మనసు అనంత గగనసీమలో స్వేచ్ఛగా విహరించి వచ్చే విహంగమే. నేను ఈ జబ్బుకు మంచానికి బంధింపబడిలేను. నా తలంపులు పవిత్రంగా ఉంచుకున్నాను. ఆ క్రీస్తుదేవుని నమ్ముకున్న నాకు ఆ స్వేచ్ఛ ఉంది. ఈ జబ్బుకు బానిసనై బంధింపబడి లేను. నాకు స్వేచ్ఛ ఉంది. ప్రతి కలుషాన్నుండి - ప్రతిబంధకంనుండి - ప్రతి నిరాశ నిస్పృహలనుండి నాకు విముక్తి లభించింది. స్వేచ్ఛ అంటే అదే. ఇలాగే ఆ

ఘోరాపరాధం చేసినవాడు కూడ ఈ విధమైన స్వేచ్ఛను పొందాలని మావారి తపన. ఆ బంధిఖానానుండి బైటపడాలని గాని, ఆ ఉరికంబంనుండి రక్షింపబడాలని గాని అతడు కోరడు."

"బాబోయ్.... అది సాధ్యమా? నేను నమ్మను."

శాంత నవ్వింది. "ఔను. విశ్వసించటం కష్టం."

"ఇంకా ఏంచేస్తారమ్మా?"

"ప్రసూతి గృహాలను దర్శిస్తారు."

"బాబోయ్" అంది, ముసిముసిగ నవ్వుతూ.

"అమ్మా-మీకు సంతానం-" అంది మెల్లగ.

"ఒక పాప. పేరు పవిత్ర. మా అమ్మవాళ్ళ దగ్గర ఉంది. వస్తూపోతూ ఉంటుంది. తనకై తాను అన్నీ చేసుకోగలిగినప్పుడు ఇక్కడే ఉంటుంది. మా అమ్మవాళ్ళ ఇల్లు రెండు మైళ్ళ దూరంలో ఉంది. అయ్యగారు ప్రతి రోజు వెళ్ళి చూచివస్తారు."

"ప్రసూతి గృహాల్లో ఏంచేస్తారు?"

"పుట్టిన పిల్లల్ని చూచి ఆశీర్వదించి ప్రార్థన చేసివస్తారు. భగవంతుడికి కృతజ్ఞతలు చెప్పుకోవద్దా?"

"తలిదండ్రులు చెప్పుకోరా?"

"చెప్పుకుంటారు. వారితో కలిసి చెప్పుకుంటారు. పుట్టిన పిల్లల్లో ఏదైనా లోపం ఉన్నా-జబ్బుఉన్నా వారికి ధైర్యంచెప్పి ఆ బిడ్డను భరించటానికి కావలసిన శక్తిని, మనోబలాన్ని ఆ తలిదండ్రుల కివ్వమని ప్రార్థనచేస్తారు. పుట్టగానే కొందరు పసిపాపలు చనిపోతారు. వాళ్ళను ఓదార్చి తగురీతి వ్యవహరించి వారి సుఖదుఃఖాలలో పాలుపంచుకోటానికి వెళ్తారు. ఆపరేషన్లు చేసేటప్పుడు బంధువులతోపాటు వెయిటింగ్‌రూంలో కనిపెట్టి కూర్చుంటారు..... ఇకపోతే పెళ్ళిళ్ళు - చావులు- మిగతా శుభకార్యాల బాధ్యతలు ఉండనే ఉన్నాయి."

"అమ్మా-మరి ఇంత సేవ చేస్తున్నారు కదా-డబ్బుకూడ బాగానే ఇస్తారుగా."

"లేదు, పల్లెటూరి పంతులుకు పాలు పెరుగు పంపినట్లు ఈ నగరంలో ఎవ్వరు పంపరు. ఇది మీ స్వంతానికి అని చెప్పి ఇస్తేనే అది మాకు చెందుతుంది. లేకపోతే గుడికి వెళ్తుంది."

"మీరు ఉద్యోగం చేసేవారా?"

"టీచర్‌గా చేసేదాన్ని."

ఇంతలో బైట సైకిల్ శబ్దం వినపడగా శాంత ముఖం ప్రఫుల్లమైంది. చటుక్కున సుశీలవైపు చూచింది. 'ఇక నువ్వు వెళ్ళు' అన్నలా ఉందాచూపు.

ఆమె అతడికోసం ఎదురుచూస్తోంది. సునీత వెళ్ళిపోయింది.అతడు కిటికీలోంచి అగుపించాడు, జామకాయలు కోస్తూ. ఆమె కళ్ళు అర్ద్రమయ్యాయి. వెనుక తలుపు తాళం తీసుకుని వచ్చాడు.

"శాంతూ.... చూడు....దోరకాయలు-చిలకొట్టింది కావాలా?"

ఆమె కళ్ళు రెపరెపలాడించి నవ్వింది. "రెండు కాళ్ళున్నా రెక్కల్లేని చిలకొట్టింది తీపిగా ఉంటుందేమో!" అతడు నవ్వి దగ్గరకు వచ్చి కూర్చు న్నాడు. జామపండు ఒకటి ఆమెకందించి, మరొకటి తను తీసుకున్నాడు,

"తీపి కాయలు" అంది కరకర నము లుతూ.

"మొన్న ఉత్తరాదివారింటి కెళ్ళాను. దీనిలో నిమ్మరసం-కాస్తబెల్లం - మిరి యాలపొడి- ఉప్పు వేసి ముక్కల చట్నీ అని- పెట్టారు."

"అదేం రుచి!" ముఖం చిట్లించింది.

హోటల్‌నించి తెచ్చిన కేరేజి విప్పి ఆమెకుపెట్టి కంచం ముందుంచాడు. తను కూడా అక్కడే కూర్చొని భోంచేశాడు.

"ఇవ్వాళ ఎక్కడికి కెళ్ళారు?"

అతడు తిరిగిన స్థలాలలో ఉన్న-దుఃఖం-ఇబ్బంది-అస్వస్థత-హింస-పగ-దుష్టత్వం-మినహా అనందాన్ని చేకూర్చే కొద్ది విషయాలు అమెకు చెప్పాడు.

"పవిత్రకు జలుబు చేసింది. ఈ రెండురోజులు రావొద్దన్నాను."

కాసేపు ఇద్దరూ మాట్లాడుకున్నారు. ఆ తరువాత ఇల్లు నిశ్శబ్దమైంది.

మూడు గంటలకు సునీత మెల్లగా ఇవతలికి వచ్చింది. ఈజీ చైర్‌లో పడుకుని కాళ్ళు మంచంమీద పెట్టుకుని హాదరీ నిదురబోతున్నాడు.

ఆ గది ప్రశాంతంగా ఉంది.

ఆమె వారిని కాసేపు గమనించి చూచింది. అతడు కదలగా గబుక్కున వెళ్ళిపోయింది.

అప్పుడు గట్టిగా అనుకుంది సునీత. ఎటువంటి పరిస్థితుల్లోను ఈ గృహాన్ని వీడకూడదు.

ఆమె వదకలో ఉండే నిస్సహాయ. అతడు పురుషుడు.

ఈ రెండు కారణాలు ఆమెను ఆ గృహానికి బంధించివేశాయి. తను ఈ భద్రతను వీడిపోలేదు. అంతే.

రెండు రోజులు గడిచిపోయాయి. భర్త తనను, సునీతను గూర్చి అడుగు తాదేమో అని ఎదురుచూసింది, కాని అతడు అడగలేదు. మూడవరోజు మధ్యాహ్నం తానే చెప్పింది.

అతడు ఈజీచైర్‌లో పడుకుని ఆలో చించాడు.

"ఇటువంటి పరిస్థితుల్లో మనం అసలు ఉంచుకోకూడదు. ఆమెకు భర్త ఉన్నాడు, అతడికి తెలిసిందంటే ముందర మనకు ముప్పు. అమెను తనను:డి బలాత్కారంగా తీసుకొని వెళ్ళాడని- కారణం నీకు సేవచేయటాకని చెబుతాడు, పోలీసులకు. లోకం చాలా చెడ్డది శాంతా. నేను మెల్లగా బోధపరుస్తాను. నువ్వు కూడ వెళ్ళమని చెప్పు. నీకు ఒక తోడు అవసరం. పాపను తీసుకుని మీ అమ్మ గారు ప్రతిరోజు పదకొండు గంటలకు

వస్తారు. నేను అప్పుడు వెళ్ళి రాత్రికి వస్తాను."

శాంత ముఖం చిట్లించింది. "ఐతే -మధ్యాహ్నాలు మీరు నా దగ్గర ఉండరా!" గోముగా అంది.

"ఉహూం....పాప ఉంటుందిగా"

శాంత మాట్లాడలేదు. కనుకొలుకుల్లో నీరు నిల్చింది.చటుక్కున అంది."ఇలాగే గడవనీయండి. నాకు ఆ విధమైన మార్పు ఇష్టంలేదు."

"మొన్న నీవు చెప్పగా ఈ నిర్ణయం తీసుకున్నా ననుకోకు. మీ అమ్మగారు నెలరోజులుగా తయారుగా ఉన్నారు. కాని మీ తమ్ముడికి వైరస్‌ఫీవర్ వస్తే ఆలస్య మైంది. ఇప్పుడు కులాసాగానే ఉన్నా డులే.

"తమ్ముడికి జ్వరమా!"

"ఔను. నీకు చెప్పనేలేదు."

"నాకు చెప్పకుండా ఎన్ని దాచారో!" అంది తెచ్చికోలుకోపం ప్రదర్శిస్తూ.

"నా హృదయమే తెరిచినపుస్తకంలా నీ ఎదుటఉంటే నేనేం దాచగలను!" అన్నాడు ముడివడిన ఆమె వొనలు మీద సుతారంగా రాస్తూ.

ఆ చేతిని ఆమె అలాగే పట్టుకుని చెక్కిలికి అనించుకుంది. ఆమె ముఖం లోని ఆనంద వీచికల్ని - పెదిమలమీది దరహాసాన్ని చూస్తూ ఆమెకు ఏదికూడా చెప్పకూడదనే నిర్ణయించుకున్నాడు.

'నా హృదయమే తెరిచిన పుస్తకంలా నీ ఎదుట ఉంటే నేనేం దాచగలను!' ఇది వంచన కాదా! అంతరాత్మ హెచ్చరించింది. కాని అతడికి తెలుసును. ఈ విషయంలో-ఆమెకు కొన్ని విషయాలు తెలియకపోవటమే మంచిది.

రెండురోజులు గడిచిపోయాయి.

సునీత వెళ్ళే ప్రయత్నం చేయలేదు. ఆ రోజున వచ్చి "అమ్మగారూ హోటల్ భోజనం ఎందుకమ్మా నేనువండిపెడ్తాను" అంది ఎంతో వినయంగ. శాంత హృదయం ఒక్క క్షణం పొంగిపోయింది. కాని వెంటనే భర్తమాటలు గుర్తుకు వచ్చాయి. ఆమెతో సన్నిహితంగా ఉండకూడదు. గంభీరంగా అంది "ఒద్దు. మాకు అలవాటే. నీవు అతిథిగా ఉండి వెళ్ళిపోయేదానివి. అన్నట్లు ఎప్పుడు వెళ్తావు? ఎక్కడికి వెళ్ళాలనుకుంటున్నావు?"

సునీత హాయిగా నవ్వింది "అతిథి అంటున్నారు. ఎప్పుడు వెళ్తావు? అని అడుగుతున్నారు. అలా అడగవచ్చునా అమ్మా!"

"ఈ కరువు కాలంలో అడగవచ్చు. అందునా మాబోటివారు అడగటంలో తప్పులేదు."

"అమ్మా ఏ ప్రమాణంచేయమన్నా చేస్తాను నేను ఏ విధంగా మీకు...."

"సునీతా అదంతా అనవసరం! మా జీవిత విధానంలో ఆశ్రితులకు మరో ఆశ్రయం లభించేవరకు ఉంచుకోవటం

ధర్మంగా భావించాము. నిన్ను నడివీధిలో ఒదలము. నీకు మరేం భయంలేదు.మరో విషయం చెప్పానా? ఈ ఇంట్లో నీలాంటి వ్యక్తిని ఉంచుకోకూడదు. మాకు అనుమతి లేదు."

"అనుమతి ఎవరివ్వాలమ్మా? అయ్య గారు ఈ గృహయజమానికారా" సునీత ఆందోళనతో ప్రశ్నించింది.

"వారు గృహ యజమానులే-" అంది నవ్వుతూ. సునీతకు అర్థంకాలేదు.

"ఇంటికెళ్ళావా? అని ప్రశ్నిస్తే- "ఇల్లు"కు వెళ్ళావా అని కాదుగదా అర్థం. అగృహంలో ఉండే పరివారం- ఆ గృహం తనకు అందించే వాతావరణం లోకి అని కదా అర్థం. అలాగే ఈ ఇంటికి వారు పెద్దలు. కాని ఈ గృహం- నాల్గు గోడలు కప్పు ఉండే ఈ ఉట్టిఇల్లు మాది కాదు. దీనిపై మాకు హక్కు లేదు. ఫ్రీ క్వార్టర్. దీనిలో ఎవరు ఉండ వచ్చునో వాళ్ళు నిర్ణయిస్తారు. ఆ గెస్ట్ రూంలో నీలాంటి వారు కొన్నాళ్ళుంది వెళ్తారు అంతే!"

సునీత ఆశ్చర్యంతో చూస్తోంది.

శాంత ట్రాన్సిస్టర్ ఆన్‌చేసి పాప గౌనుమీద పూలు కుట్టటం ప్రారంభిం చింది. ఇక ఆమె మాట్లాడదు! ట్రాన్సి స్టర్ ఏదో వాగుతుంటే ఆమెకు సందడిగా ఉన్నట్లుంటుందట.

సునీతకు మాట్లడాలని ఉంది. కొపం గాను ఉంది. ఈమెకు సమీపంగా రావాలని- స్నేహాన్ని పెంచుకోవాలని ఉంది. కాని ఈమె దూరంగానే ఉంటుంది లాభంలేదా. ఈ భద్రతనా తను కొల్పో లేదు అతడికి సన్నిహితురాలైతే!

అతడు వచ్చేవరకు ఆమె గుమ్మంలో కూర్చుని ఉంది. అతడు వచ్చి తాళం చెవిత్రిప్పటం శబ్దంవిని మెల్లగా తనగది లోకి వెళ్ళిపోయింది. పాపవచ్చింది. గోలగోలగా నవ్వులతో సందడిగా ఉంది. పాప ఏదో మాట్లాడుతోంది. శాంత ఏదో అడుగుతోంది - మధ్యమధ్యన పాప ఏదో అడుగుతోంది.... ఆ దృశ్యం చూడాలని ఉవ్విళ్ళూరిందామె. కాని తనకు అది నిషిద్ధం ఆ స్థలం రెండు గదులు అవతల అయినా అది ఆమెకు చేరలేని దూరాతి దూరమైన స్థలంలా ఉంది. తొంగి చూడ టానికికూడ వీల్లేదు. ఉగ్గబట్టి తలుపుకు ఆనుకుంది.

ఆమె చెవుల్లో పాపమాటలు ముద్దుగా వినవస్తున్నాయి.

పాపం పాపకు తల్లి ముచ్చట తీరదు....

మెరుపులా ఒక ఆలోచన తట్టింది.

తను పాపకు చేరువ అయితే.

పాపకోసమైనా తనను పొమ్మనరు.

బ్రహ్మాండమైన ఆలోచన.

ఆమె చటుక్కున తలుపు తీసుకుని ఇవతలికి వచ్చింది. ఆ క్షణంలో తనపరిధి మరచిపోయింది సునీత,

"అమ్మా" అంటూ వెళ్ళింది

శాంత పాపకు స్పూన్‌తో తినిపిస్తోంది

"పాపమాటలు విన్నాను. చూద్దామని"

"రా....రా.... ఇదో మా మాటకారి బంగారు తల్లి"

పాప బుగ్గలనిండా అన్నం ఉంది. చేతిలో అరటిపండు ఉంది, బొద్దుగా కాక పీలగా కాక మధ్యస్తంగా ఉంది. చెదరిన కాటుక కళ్ళెత్తి 'ఎవరీమె?' అన్నట్లు చూచింది.

"చిన్నపిల్లల ముద్దుముచ్చట్లు చూచి చాలరోజులైందమ్మా" అంది ఆర్ద్రంగా.

శాంత అర్థవంతంగా తలాడించింది

ఆయన పాపకు కావలసినవి మళ్ళీ వడ్డించి టిఫిన్‌కేరేజి మూసేశాడు.

"నువ్వు భోంచేశావా?" శాంత అడిగింది.

"లేదమ్మా."

"వెళ్ళి తిను, ఒంటిగంట కావస్తోంది"

"ఈ పూట వంట చేయలేదు" మెల్లగా అంది.

"ఏం....బియ్యం—పప్పులు లేవా!"

"ఉన్నాయి.... వండుకోవాలని పించలేదు"

శాంత భర్తవేపు చూచింది. ఆయన పాపను తీసుకుని మూతి కడిగించటానికి లేచాడు. సునీత గభాల్న ఇవతలికి వచ్చి అంది "నేను కడుగుతానయ్యగారూ."

పాప తండ్రికి మరీ దగ్గరగా జరిగి చేయిపట్టుకుంది. "రామ్మా" అంది సునీత.

పాప వెళ్ళలేదు. "ఒద్దులేమ్మా, కొత్త" అన్నాడు. పాపకు మూతి కడిగాక వస్తూ వస్తూ ఒక చిన్న గిన్నె తెచ్చాడు. కాస్త అన్నం—పులుసు పచ్చడి వేసి ఆమెకిస్తూ "వెళ్ళి తినమ్మా" అన్నాడు.

"ఒద్దు బాబు—మీరు భోంచెయ్యండి" అంటూ వెనుదిరిగింది.

కాని శాంత అంది "నువ్వు ఆకలితో వస్తువుంటే మేంతినగలమా? తీసుకెళ్ళు సునీతా."

"నేను వండుకుంటాను, మీరు తినండి."

సునీత వెళ్ళిపోయింది.

ఆయన దీర్ఘంగా ఊపిరించాడు.

శాంత "పాపం" అంది జాలితో, మెల్లగా.

"నాకు జాలేస్తోందండీ" అంది భర్త వేపు చూచి.

"అవును ఆ జాలి, దయను ఊతగా పట్టుకున్నదంటే మనకు చాలా కష్టం. ఒదిలించుకోలేము జాగ్రత్త శాంతా. ఆ జాలిని బయటబడనివ్వకు" వాళ్ళు భోంచేసి కాసేపు పడుకుని లేచారు. పాప ఇంకా తల్లి ప్రక్కలో నిదరబోతోంది.

అప్పుడుశాంత సునీతను పిల్చింది.

ఆమె రాగానే ఆయన అన్నాడు "చూడమ్మా, నీవు వచ్చి వారంరోజులైంది. ఇంకా నీ ప్రోగ్రాం చెప్పలేదు. నాకు తెలిసిన ఒక శరణాలయం ఉంది. మాట్లాడి వచ్చాను."

"ఒద్దు....ఒద్దు....బాబు ఆ శరణా

కొత్త రోడ్లను కూడా నిరభ్యంతరంగా
టెలిఫోన్స్ వాళ్ళు తవ్వి పారేశారంటే.....



లయాల్లో నే నుండలేను" ఆమె భయంతో అరిచినట్లే అంది.

"మళ్ళీ మొదటికే వస్తున్నాము."

సునీత అంది "మీకు ఒక పనిమనిషి అవసరం. అమ్మగార్కి తోడు అవసరం. ఎల్లకాలం ఇలాగే గడుస్తుందా బాబూ! రేపు పాప ఇక్కడే ఉంటే ఒక ఆడదిక్కు అవసరం కాదా. నన్ను కనికరించండి."

"మా ఇష్టప్రకారం నిన్ను ఉంచేసుకోటానికి మాకు అనుమతి లేదు. మాపై మతాధికారుల, చర్చికి సంబంధించిన పెద్దల అనుమతి కావాలి."

"ఇంకేం బాబు—మీ పరిస్థితుల్లో వాళ్ళు తప్పక అంగీకరిస్తారు" ఆశగా చూచింది.

ఆయన నవ్వాడు "ఏమో! నీ వన్నట్లు వాళ్ళు అంగీకరించినా—నేను ఒప్పుకోను. ఎందుకంటావా! పరోవ్యక్తిని భరించే ఆర్థికస్థోమత నాకు లేదు. నీవు ఎంతగా పొదుపుచేసి నేలపైపడుకుని గంజినీళ్ళు తాగినా నేను భరించలేను."

"అయ్యో—గురువులు మీరు. మీది అంత కఠిన హృదయమా...."

"ఔనమ్మా—నీ కథ విన్నాక మా అధికార్లు ఒప్పుకోరని గట్టిగా చెప్పగలను."

"అయితే—వారికి ఏమీ చెప్పకండి. ఏదో దూరపు బంధువుగా ఉండిపోతాను."

ఆయన ఆశ్చర్యంతో చూచాడు. ఆ తరువాత దృఢంగా అన్నాడు. "అలా జరగటానికి వీల్లేదు. అబద్ధం చెప్పను"

ఆమె దిగులుపడిపోయింది "పోనీ.... మీరు ఒప్పించలేరా బాబు."

"ఒప్పించగలను—కానీ...."

"అయితే— ఇంకేమిటి బాబూ—" గభాల్న అంది.

"కాని-నీ విషయం వేరు. నీవుభర్తను ఒదిలి పారిపోయివచ్చిన దానవు. నీవు చెప్పినదాన్నిబట్టి నీ భర్త ఎప్పుడైనా రావచ్చును — పోలీసులతో సహా. నేను మతగురువును, ఆ భగవంతుడికి గాని, ఆలయానికి గాని, ఈ పాదరీ ఉద్యోగానికి గాని, నాకుగాని ఎటువంటి కళంకం రాకుండా కాపాడటం నా విధి. కనుక నీవు తక్షణం వెళ్ళి పోవాలి. లేదా నేను చూపించే ఆశ్రమానికి వెళ్ళాలి."

"అంత నిర్దయగా మాట్లాడకండి బాబూ. నా భర్త అనే వ్యక్తివచ్చి తిరిగి నన్ను పాపపంకిలంలోకి త్రోసివేస్తే ఆ పాపం మీకు చుట్టుకోదూ?"

"చుట్టుకోదు. ఎందుకంటే నీవు నీభర్త ఆధీనంలో ఉన్నావు. అతడి నేరం ఋజువుఅయ్యేవరకు అతడు నీ భర్తే. ఈ విషయంలో అతడి నుండి విడుదల పొందాలంటే జరిగినదంతా పోలీసులకు చెప్పి రిపోర్ట్ ఇవ్వటం—అ త రు వా త ఆశ్రయంలో ఉండటం."

"అమ్మో—పోలీసులకు రిపోర్ట్ ఇవ్వటమే. వాళ్ళ సంగతి మీకు తెలియదా? నన్ను వాళ్ళు నిశ్చింతగా ఉండనిస్తారా? నా భర్త లంచంఇచ్చి నన్ను తీసుకెళ్ళి పోతే!" భయంతో అంది.

"అలా జ రు గ దు. అనవసరంగా భయపడుతున్నావు."

ఇక మాట్లాడటానికి ఏమీలేదన్నట్లుగా అయన వెళ్ళిపోయాడు

"అమ్మా—నా తరపున మాట్లాడలేరా?"

శాంత లేదన్నట్లుం తలూచింది.

పాప నిదురలేచింది. సునీత లేచి పాపను పిల్చి దగ్గరకు తీసుకోబోయింది. కాని పాప దూరగా తొలగి బాత్‌రూంవేపు వెళ్ళింది.

"పాపకు క్రొత్త" అంది శాంత.

పాప కాసేపటికి చెడ్డేని చక్కగ పైకిలాక్కొని తల్లి దగ్గరకు వచ్చింది. తల దువ్వించుకుని బల్లమీద గ్లాసులో ఉన్న పాలు త్రాగి, పండు తిన్నది.

"చల్లని పాలు, వేడిగాత్రాగితే బాగుంటుందమ్మా."

శాంత "అలవాటే సునీతా" అంది మెల్లగా.

పాప ఒక ప్లాస్టిక్‌సంచి తీసుకుని నేలమీద బోర్లించింది. ఎన్ని ఆటవస్తువులో—డబ్బాలు—మూతలు — బాశీశిళ్ళు— కాలో, చెయ్యో ఊడిన బొమ్మలు, విడి విడి చేతులు, కాళ్ళు, ముక్కలు కొరికేసిన ఏనుగు, బాతు, కోతి ఎన్నో ఉన్నాయి, ఆ వస్తు సరంజామా కేసి నిర్లిప్తతతో చూ స్తుం డి పో యి ం ది సునీత.

ఆ రాత్రి అయన దృఢనిశ్చయానికి వచ్చాడు. ఏది జరిగినప్పటికి శాంతకు ఏమీ తెలియకూడదు. ఆమె మానసికంగా బాధపడకూడదు, తమ జీవితాలు సంతోషంగా గడిచిపోవాలి. అంటే....ఆమెతో రహస్యంగ మాట్లాడాలి. ఆమెను ఒప్పించాలి.

ఆ ఆదివారం గుడికి వచ్చినవారిలో చాలామంది శాంతను చూచి పలుకరించి వెళ్ళారు. కొందరు పండ్లు తినుబండారాలు తెచ్చారు.

ప్రక్క గది తెరచిఉండటంతో చాలామంది సునీతను చూచారు. వాళ్ళు ఆశ్చర్యపడలేదు. ఎంతోమంది ఆడ మగవారు రెండు మూడురోజులు ఈ ఇంట్లో తలదాచుకుని వెళ్ళిపోతారు. కొందరు ఆమెను పలకరించాలని చూచారు గాని సునీత మోకాళ్ళమీద తలఆన్చి తలఎత్తి చూడలేదు, ఇంకా సందడిగానే ఉంది. ఒకరు ఇద్దరు వచ్చిపోతూనే ఉన్నారు. పాపకూడ ఉంది. ఉరుకులు పరుగులు దీస్తూ ఇల్లంతా తిరుగుతోంది. ఆదివారమంటే పవిత్రకు చాలా ఇష్టం. గుడిలో ముందులైన్లోకూర్చుని తండ్రినిచూస్తుండవచ్చు. ఇంట్లో తల్లిదగ్గర మిఠాయిలుంటాయి. సాయంత్రం వరకు అక్కడే ఉండవచ్చు.

ఆ గృహవాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. వచ్చిపోయే మనుషులు గాని, వారి మాటలుగాని ఆమెలో భయాన్ని కల్గించలేదు. ఈ ఆవరణం తనకు తెలిసినవాటికి భిన్నంగా ఉంది।

"సునీతా" అన్న గంభీరస్వరం వినగానే ఆమె తలెత్తి చూచింది. ఆ స్వరం ఆమెలో ఒకింత సంచలనాన్ని కల్గించకపోలేదు.

ఏ జీవితాన్నుండి తప్పించుకుని పారిపోయివచ్చిందో—అటువంటి జీవితంలోకి తను ఇష్టానుసారంగ ప్రవేశించటానికి ఇష్టపడ్తోంది।

ఎంత విచిత్రం।

ఆమె ఎదుట పాదిరీ మంచుని ఉన్నాడు.

అతడు ఇంకా తెల్లగౌను వేసుకునే ఉన్నాడు.

"నీతో ఏకాంతంగా మాట్లాడాలి."

"అయ్యగారూ—వింటున్నాను" అంది ఆత్రంగా.

"ఇలా నీతో మాట్లాడిన ఈ విషయం శాంతకు తెలియకూడదు."

సునీత ముఖం ఒక్క వెలుగు వెలిగింది. ఆవరణం సందడిగానే ఉంది. మనుషులు కనబడుతూనే ఉన్నారు. ఇలాంటి సమయంలో ఎవ్వరికీ అనుమానం రాదని ఎంత తెలివిగా ఆలోచించాడు. మామూలు రోజుల్లో నిశ్శబ్దంగా ఉన్న ఇంట్లో ఏకాంతంగ మాట్లాడలేరు. శాంత పసిగట్టగలదు. ఇలా తెరిచిన తలుపులు—తిరుగుతున్న మనుషుల మధ్య జరిగే సంభాషణ అతి మామూలు సంభాషణ అనుకొంటారు. ఆమె హృదయం పైశాచికానందంతో పొంగిపోయింది. తనుకూడ దిగజారిపోయిందా। అయితే ఏం—సురక్షితంగా ఈ జీవితాన్ని వెళ్ళబుచ్చవచ్చును. విజేతగా ఆమె కళ్ళలో ఒక విధమైన పైశాచికానందం పొడసూపింది.

నువ్వెంత! చివరికి వచ్చావు! పృథ్వి పై మన్న మొదటి సోపానం చెంతకు.... ఓరి మగవాడా!

ఆమెకు చటుక్కున సోమర్ సెట్ మామ్ కథ గుర్తుకువచ్చింది. ఆ కథలో ఆ ఆడది టుపుక్కున ఊసినట్లు గుర్తు. కానీ తన జీవితం నందనవనంలోకి ప్రవేశింపబోతోంది - కనుక ఈతడు 'అలాంటి'వాడు అవటమే తనకు కావలసింది.

"చెప్పండి" అంది మెల్లగా.

అతడు కంఠం తగ్గించి "శాంతకు ఏమీ తెలియకూడదు. ఈ జీవితాలు ఎప్పటిలానేగా సాగిపోవాలి. ఆమెకు నీపై అణుమాత్రంగానైన అనుమానం కల్గకూడదు"

"అయ్యా-తెలియనివ్వను-అతి జాగ్రత్తగా ఉంటాను" ఆవేశంగా మెల్లగా అంది.

ఆమె కంఠంలో ధ్వనించిన నిజాయితీకి అతడికి ధైర్యం వచ్చింది.

అతడు చెప్పబోయే విషయమేమిటో గ్రహింపుకు అందుతోంది. ఎన్నిమార్లు అంటున్నాడు! శాంతకు తెలియకూడదని అతడి నోటవినాలి-విజయగర్వంతో ఆమె సూటిగా అతడి దెస చూచింది.

ఆయన ముఖంలో ఏదో మార్పు. శాంతంలేదు. ముఖంలోని కండరాలు లాక్కుపోతున్నలా ఉంది. ఆమె అతడి కళ్ళలోకి చూచే ధైర్యంలేక తలవంచుకున్నది.

అతడు కంఠం తగ్గించి- గంభీరంగా అన్నాడు

"విజయవర్ధనీ!"

ఆ పేరు వినటం తడవు ఆమె ముఖం పాలిపోయింది. గుండెల్లో వేయిగుఱ్ఱాల డెక్కల చప్పుడు వినవస్తోంది. ఆ వేగానికి శరీరం తట్టుకోలేదన్నట్లు గోడకు చేరబడిపోయింది. ఎండారిన కంఠం లోంచి వేదనాభరిత మూల్గు బహిర్గతమైంది- "అయ్యో"....అని కంపిస్తోన్న చేతులతో ముఖం కప్పుకుంది.

"నీ గురించి అంతా తెలుసుకున్నాను. నాలాంటివాడికి ఎన్నో అడ్డంకులు, శోధనలు. నీది ఒకరకమైన శోధన. ఇంకో అరగంటకు పోలీస్ ఇన్స్పెక్టర్ వచ్చి నిన్ను తీసుకొని వెళ్తాడు."

ఆమె చివ్వున తలెత్తి చూచింది. భయంతో గజగజ ఒణికిపోతూ నూతిలోంచి మాట్లాడినట్లు అంది "పోలీసులు .... నన్ను వారికి పట్టిస్తున్నారా?"

"చూడమ్మా, ఇది నా డ్యూటీ. ఆత్మరక్షణ కోసం నీవు ఈ నేరంచేయవలసి వచ్చిందని చెప్పుకో. శాంత నీ కట్టుకథ నమ్మింది.నీవు ఒక మనిషిని చంపబోయావని తెలుసుకున్నదంటే మానసికంగా చాలా బాధపడ్తుంది. ఒక ఆత్మీయురాలిగా ఈ కొద్దిరోజులు మసలిన నీవు ఆ నేరం చేయబోయావనుకుంటే - ఆమెకు

అయ్యా! మీ వూరు హైద్రాబాదన్న మాట !!

షాకింగ్‌గా ఉంటుంది. పడకలో ఉంది అదే ఆలోచిస్తుంది. లేచి తలదువ్వుకుని అతి మామూలుగ వెళ్ళిపోతున్నానని చెప్పిరా."

"అయ్యో— చంపబోయానా? అతడు చనిపోలేదా?"

"లేదు. బాగా త్రాగిఉన్నందున పడిపోయాడు. బాగా రక్తంపోయిందట. రక్తంఎక్కించారు. కోలుకుంటున్నాడు."

ఆ కబురు వినగానే ఆమెకు కొండంత బలం వచ్చింది. అయితే తను హంతకురాలు కాదు. "హమ్మయ్య" అంటూ రెండు చేతులెత్తి తలమీదుగ దండం పెట్టింది.

"టైంలేదు. వెళ్ళి కాంతకు చెప్పిరా."

ఆమె కళ్ళు తుడుచుకుని మెల్లగా "నా కథ వినరా అయ్యా!

"నాకు కొంతవరకు తెలుసును. అది చాలు. టైంలేదు. నీవు ఎప్పటికైనా ఒంటరిగా మిగిలావంటే ఈ అడ్రస్ దాచుకుని అక్కడికి వెళ్ళు. ఈ శరణాలయంలో నీవు నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చగలవు. కాంతప్రశ్నలకు జవాబులేం చెప్పకు"

అతడు వెళ్ళిపోయాడు.

ఆమె యాంత్రికంగా లేచి తలదువ్వుకుని కాంతదగ్గరకు వెళ్ళింది. కాంత పెరట్లో జామచెట్టు క్రింద ఈజీచైర్‌లో

పడుకుని ఉంది. ఆమెకు సమీపంగా మరొక స్త్రీ కూర్చునిఉంది.

"రా సునీతా- మా అమ్మగారు" అంది శాంత.

"నమస్కారం అమ్మా- "అని అటు తరువాత శాంతవైపు తిరిగి అంది "అమ్మా ఇన్నాళ్ళు నాకు ఆశ్రయమిచ్చినందుకు నా హృదయపూర్వక కతజ్ఞతా వందనాలు. మీ ఋణం ఎన్నటికి తీర్చుకోలేను. వెళ్ళొస్తానమ్మా-అయ్యగారూ...." అని ఇవతలికి తిరిగింది. పాప నెత్తుకుని ఆయన వస్తున్నాడు. చిరునవ్వు నవ్వి "వెళ్ళిపోతున్నావా!" అని అడిగాడు.

అతడికేసి ధైర్యంగా చూచే అర్హత-హృదయనైర్మల్యం ఆమెలో లేనందువలన తలవంచుకుని కన్నీరు కారుతుండగా చేతులెత్తి నమస్కరించింది.

"ఇన్నాళ్ళు ఉండి_మీ కెంతో కష్టం కలిగించాను బాబూ. క్షమించండి. మళ్ళీ అడుగుతున్నాను - క్షమించండి" ఆమె గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

అప్పుడే ఇన్స్‌పెక్టర్ వచ్చి చెక్క గేట్ దగ్గర స్కూటర్ ఆపాడు.

ఎదురుచూస్తున్న పాదరీ గబగబ బైటికెళ్ళాడు.

"నమస్కారమండీ....రండి."

ఆయన లోపలికొచ్చి కూర్చున్నాడు.

"ఆమెకు చెప్పాను. సిద్ధంగా ఉంది"

"మీకు చాలా థాంక్స్....పాప....మీ పవిత్రనుకుంటా" పాప జవాబు చెప్పింది "ఔను. నేను పవిత్రనే" ఆయన నవ్వి పాప తలమీద చేయివేసి ముద్దుగా నిమిరాడు.

"రండి....నా రిక్వెస్ట్ మర్చిపోకండి" అంటూ అటువైపు నడిచాడు.

"నేను మీకు మాట ఇచ్చాను. జైల్లో ఏ అత్యాచారం జరగనివ్వను. ఒకవేళ శిక్ష కొద్దిమాసాలకు పడితే- విడుదల అయినవెంటనే మీరు కోరిన శరణాలయానికి పంపుతాను" ఆయన పాదరీ చేయి అందుకుని మాట ఇస్తున్నట్లు కాసేపు పట్టుకొని ఒదిలేశాడు.

ఇరువురు వర్ధని గదిబైట నుంచున్నారు.

తలుపులు బార్లా తెరిచి ఉన్నాయి ఇన్స్‌పెక్టర్ తన సహజమైన అనుమానంతో లోపలికి తొంగిచూచాడు.

"వర్ధనీరామ్మా" ఆయన పిల్చాడు మరబొమ్మలా వచ్చిందామె. ఇన్స్‌పెక్టర్‌కు నమస్కరించి తల వంచుకుంది.

"పదమ్మా వెళ్దాం" ఆయన గంభీరంగ అన్నాడు. కృతజ్ఞతతో కన్నీటి పొరల్లోంచి పాదరీని చూచి నమస్కరించి అతడి వెనుక నడిచింది.

చెక్కగేట్ దాటారు. బార్లుతీరిన చెట్ల మధ్యలోంచి నడుస్తున్నారు. ఒకరు ఇద్దరు ఇంకా తిరుగుతూనే ఉన్నారు.

అతి భారంగ ఆమె అడుగులు పడుతున్నాయి.

ఆమె హృదయం ఒక భీకరమైన సత్యం మాటునా నలిగిపోతోంది. తనకు స్వేచ్ఛ అంటూ లభించినా ఈ ఇంటి తలుపులు తనకోసం ఎవ్వరు తెరవరు. తను దిగజారిపోయింది- దిగజారి ఒక మహిమాన్వితుని దిగజార్చాలనిచూచింది. తను ఇప్పుడు ఎంత బాధపడినాలాభంలేదు

స్కూటరును నడిపించుకుంటూ గేటు సమీపించారు అక్కడ ఒక టాక్సీఉంది

"పోలిస్‌వాన్‌ను తేలేదు. ఎక్కమ్మా" అన్నాడు ఆయన. ఆమె ఒక ముల గాభరాగా ఫాదరివైపు తిరిగింది. ఆయన "ఎక్కమ్మా. నిష్కల్మష హృదయంతో శేషజీవితాన్ని వెళ్ళబుచ్చావంటే దేవుడు నీకు మేలు చేకూరుస్తాడు"

ఆమె ఎక్కింది.

వాళ్ళిద్దరు కరచాలనం చేసుకున్నారు.

టాక్సీ-వెనుక స్కూటర్ కదిలాయి

లోపలికెళ్తూ ఇన్స్‌పెక్టర్ తనతో చెప్పిన విషయాల్ని గూర్చి ఆలోచిస్తున్నాడు।

"....ఆమె మీకు చెప్పిన కథలో సగంవరకు నిజమే చెప్పింది. కాని హోటల్ నుండి ఆమె అంత త్వరగా బైటపడలేదు పాపం।

"సాధారణంగా ఇలాంటి స్థలాల్లో రెండు పార్టీలు ఇష్టపూర్వకంగా తమ పనులు చేసుకుంటారు. డబ్బు ఇచ్చి సుఖంపొందాలన్న కాంక్షతో వచ్చే వారుంటారు. డబ్బు పుచ్చుకుని సుఖం అందించాలని రెండో పార్టీ ఉంటుంది కాని ఈమె విషయంలో ఆ వచ్చినవాడు తన అవతలిపార్టీ సుముఖంగా లేదని తెలుసుకోలేకపోయాడు. మామూలుగా త్రాగి వచ్చాడు. లేక ఈమె బాగా త్రాగించి ఉంటుంది. లేకపోతే పోట్లాడిన చిహ్నాలుండేవి. ఆమెకు గాయాలు తగిలి ఉండేవి. అతను ఏమరుపాటున ఉండి ఉండవచ్చు. ఇన్‌వెస్టిగేషన్‌లో దొరికిన ఆధారాలను బట్టి ఆమె గ్లాసు పగులగొట్టి- దాని క్రిందపట్టుకుని బలంగా విసిరిఉండవచ్చు కొనదేలిన గాజుముక్క కంఠం ప్రక్కగా గుచ్చుకున్నాయి- అవి తేల్చాము తెలివిగా తప్పించుకుంది. కాని న్యాయానికి దొరికిపోయింది. ఆ హోటల్ అనబడే ఇల్లు-మేడ-మీ ప్రక్క వీధిలోనే ఉన్నాయి. రెయిడ్ చేశాము. చాలామందిని పట్టుకున్నాము, కేకలేసి పిల్చిందట. రక్తాన్ని చూచి భయపడి ఉంటుంది. వచ్చినవాళ్ళు గాభరాగా ఏం చెయ్యాలో తోచక హడావిడి పడ్తున్న సమయంలో- డాక్టర్ కోసం పరిగెత్తే వారివెంట-లేదా ఎలాగో బైటపడింది. ఆ ఖంగారు- భయంతో ఏం చెయ్యాలో ఎవరికి తోచిఉండదు. ముఖ్య విషయం- ఆ వ్యక్తి చాలా ధనవంతుడు పలుకుబడి ఉన్నావాడు. అందుకని అతణ్ణి డాక్టర్‌కు చూపించి రక్షించాలని ఆత్రపడి ఉంటారు."

అతడు శాంత దగ్గరకు వెళ్ళాడు.

"చాలా సడన్‌గా వెళ్ళిపోయిందే సునీత!"

"ఎంతకాలం ఉంటుంది శాంతా! రోజుకొక మారైన అడిగేవాడిని ఎప్పుడు వెళ్తావు! అని."

వెళ్ళకపోతే భయం పట్టుకుందనుకో- ఇక్కడే ఉండిపోతుందేమో- నని, ఏదో మన సేవ మనం చేస్తూ కాలం వెళ్ళబుచ్చే మనకు ఇలాంటి పారిపోయి వచ్చినవారికి ఆశ్రయం యిచ్చి లేనిపోని కష్టాలను సమస్యలను తెచ్చి పెట్టుకోవటం అవివేకం"

"నిజమేలెండి.... అంది రిలీఫ్‌గా ఫీలవుతూ

"తెలుసుగా- పాప ఎక్కడే ఉండి పోతుంది."

"ఔను అమ్మ చెప్పింది పెద్దైకూడ తేచ్చేసుకుందట అమ్మ- పాప చెప్పింది" శాంత హుషారుగా అంది.

"ఔను. అమ్మమ్మ పెత్తై తెచ్చింది అంది ముద్దుగా పాప!

ఇరువురు పాప మాటలకి హాయిగా నవ్వారు.

ఆ గృహాన్ని మునుపటి ప్రశాంత వాతావరణం ఆవరించగా ఆయన తృప్తిగా నిట్టూర్చాడు

" ప్రభూ- నీకు నా కృతజ్ఞతావందనాలు" అని చెప్పుకుని ఒక్కక్షణం కళ్ళు మూసుకున్నాడు.